క్లుప్తంగా

చెత్త సేకరణకు ఆటో వితరణ



రావిరాల(జగ్గయ్యపేట): గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చిరుమామిళ్ల బాలకృష్ణ ఆదివారం గ్రామ పంచాయతీకి తడిపొడి చెత్త సేకరించేందుకు రూ. 2.30 లక్షల విలువ చేసే ఎలక్ట్రికల్ ఆటోను ఆదివారం కార్యదర్శి ఇమాంకు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ గ్రామంలో తడిపొడి చెత్త సేకరణకు ఎలక్ట్రికల్ ఆటోను వినియోగించుకోవాలని గ్రామస్తులు తడిపొడి చెత్తను వేరు చేసి పంచాయతీ కార్మికులకు అందించాలన్నారు. ఆటోను అందించిన దాతలను పలువురు సత్కరించారు.

పునఃప్రతిష్టకు ఆలయం ముస్తాబు



జగ్గయ్యపేట: పట్టణంలోని అద్దాల బజార్‌లో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారి వెండి ఆలయం పునఃప్రతిష్టా మహత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల ఏడు, ఎనిమిది, తొమ్మిది తేదీలలో కార్యక్రమాలు జరగనున్నాయి. ఏడో తేదీన గణపతి పూజ, గోపూజ, పంచగవ్యప్రాశన, రక్షాబంధనం, ఎనిమిదిన పంచామృతాభిషేకాలు, జలాభిషేకం, దాన్య, పుష్ప శయ్యాదివాసాలు, తొమ్మిదో తేదీ ఉదయం 8.59 గంటలకు తాత్వికుడు గెంటేల వెంకట రమణ దంపతులచే విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం భారీ అన్నదాన ఉంటుందన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సమస్యలున్నట్లయితే ప్రజలు అర్జీలు దాఖలు చేసుకోవచ్చని, పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఎంపీడీఓ అన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: శ్రీరామ నవమి పండుగ సందర్భంగా పట్టణానికి చెందిన కఠారి మిత్ర మండలి వారి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్ర మండలి సభ్యులు పలు ఆలయాల వద్ద ఉన్న అనాథ వృద్ధులకు ఆహార పొట్లాలను అందజేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

వీరులపాడు: గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసే చలివేంద్రాలతో ప్రజల దాహార్తిని తీర్చవచ్చని సర్పంచ్ చలమల దుర్గారావు పేర్కొన్నారు. మండలంలోని చట్టన్నవరం గ్రామంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు చలమాల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రామాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోట పూర్ణచంద్రరావు, గూడూరు రమణ, మాదాల చిన్నబ్బాయ్, మన్నెం వెంకటేశ్వరరావు, చలమాల శ్రీనివాసరావు, కోట రమేష్, పుల్లయ్య పాల్గొన్నారు.

రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

మైలవరం: మైలవరం మండలంలోని బీసీ, ఈబీసీ, వైశ్య, కమ్మ, కాపు కార్పొరేషన్ల రుణాలకు సంబంధించి మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 8న మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ అనూరాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు మైలవరం, పొందుగల, వెల్వడం, చంద్రగూడెం, పుల్లూరు గ్రామాలు, మధ్యాహ్నం 2 గంటలకు తోలుకోడు, మొర్సుమల్లి, కీర్తిరాయునిగూడెం, వెదురుబీడెం, కనిమెర్ల తండా, చంద్రాల, గణపవరం గ్రామాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ అప్లికేషన్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలు-2 సెట్లు తీసుకురావాలని సూచించారు.

కల్యాణమే.. వైభోగమే

వాడవాడలా ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

వీరులపాడు: వాడవాడలా ఆలయాల్లో రామనామం మార్మోగింది. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అల్లూరు గ్రామంలో మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరీ ఆధ్వర్యంలో పండుగ సందర్భంగా 30 అడుగుల ప్రభను ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు టెంకాయ కొట్టి ప్రభ శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటాలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలు గ్రామస్తులు, చూపరులను ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ బందెల రాణి, నాయకులు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పచ్చాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వాడవాడలా రాములోరి కల్యాణం..

వత్సవాయి: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలో వాడవాడలా రాములోరి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రామాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించుకున్నారు. వత్సవాయి, దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, చిట్టేల, మక్కపేట, భీమవరం, గోపినేనిపాలెం, మంగొల్లు తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ జరిపించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవదాయశాఖ ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నవమిని పురస్కరించుకుని రైతులు ఆయా గ్రామాలలో ప్రభలు కట్టుకుని రామాలయాల వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు.

ఘనంగా సీతారామచంద్రుల కల్యాణం..

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో స్వామివారు, అమ్మవార్ల కల్యాణాన్ని ఆలయ వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ అర్చకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు దంపతులు, ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్, ఆలయ ఏఈవోలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలులోని పోలీస్ స్టేషన్ సెంటర్, చెరువుకట్ట బజారులోని రావిచెట్టు సెంటర్, కోదండ రామాలయం, కృష్ణమందిరం, ఎస్సీ కాలనీల్లో, పలు వీధుల్లో, మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించి భక్తులకు పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు.



అల్లూరులో ప్రభను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



తిరుపతమ్మవారి ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొన్న ఈవో కిషోర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాసరావు దంపతులు

కనుల పండువగా కల్యాణం..

జగ్గయ్యపేట: రాములవారి నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో సీతారాముల కల్యాణాలు ఆదావారం కనుల పండువగా నిర్వహించారు. గ్రామాలలో ప్రత్యేక పందిళ్లలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని అర్చకులు మార్చి రామకృష్ణశాస్త్రి జరిపించారు. ప్రత్యేక కల్యాణ మండపం ఏర్పాటు చేసి క్రతువులు నిర్వహించారు. రావిరాల ప్రసన్నాంజనేయ స్వామి వారి అఖండ దీపాన్ని ఊరేగించారు. షేర్‌మహ్మద్‌పేట, వేదాద్రి, గండ్రాయి గ్రామాలలోని రామాలయాలలో ప్రత్యేక చలువ పందిళ్లు ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. పానకం, వడపప్పు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పట్టణంలో..

బ్రాహ్మణ బజారులోని ఆంజనేయస్వామి వారి ఆలయంలో నూతనంగా సీతారాముల పంచలోహ విగ్రహాలను ఏర్పాటు చేసి అర్చకులు కల్యాణం జరిపించారు. శివాలయం సమీపంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో అర్చకుడు సాయి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. బంగారుకొట్ల సెంటరులోని సీతారామలక్ష్మణ పాలరాయి విగ్రహాలకు అర్చకులు కల్యాణం జరిపించారు.

కమనీయం.. కల్యాణోత్సవం

కంచికచర్ల: కంచికచర్ల పెద్దబజార్‌లోని రామాలయంలో స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం 3వేల మంది భక్తులకు కమిటీ సభ్యులు అన్న సమారాధన చేశారు. అదేవిధంగా మండలంలోని కీసర, గండేపల్లి, పెండ్యాల, వేములపల్లి, పరిటాల, గొట్టుముక్కల, మోగులూరు, గనిఆత్కూరు, మున్నలూరు చెవిటికల్లు, కునికెనపాడు, పేరకలపాడు తదితర గ్రామాల్లో స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిగింది. ఆలయాల వద్ద కమిటీ సభ్యులు పాయసం, పానకం, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండలంలోని కొత్తపేట గ్రామ రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొన్నారు. సర్పంచి ప్రత్తిపాటి సునీత, ఉపసర్పంచి ముప్పాళ్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవాలు

జగ్గయ్యపేట అర్బన్: ముక్త్యాల రోడ్డులోని శ్రీధన శైల సీతారామస్వామి ఆలయం(పెద్ద రామాలయం)లో శాశ్వత కల్యాణ ధర్మకర్తలు తుమ్మేపల్లి నరేంద్రరావు, వారి సోదరుల ఆధ్వర్యంలో అర్చకులు ముడుంబా వరదాచార్యులు స్వామివారికి కల్యాణం జరిపించారు. తుమ్మేపల్లి వంశీయులు గోకవరపు రాజేష్, లక్ష్మీప్రసన్న దంపతులు పీటల మీద కూర్చొనగా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తుమ్మేపల్లి గోపాలకృష్ణ, హరనాథబాబు, మాజీ దేవస్థానం చైర్మన్ తుమ్మేపల్లి వెంకటేశ్వర్లు, పేరూరి కోటేశ్వరరావు, దేవరశెట్టి గోపాలకృష్ణ, ఆలయ ఈవో హరిదుర్గారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే అప్సరా సెంటర్‌లోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ పిల్లలమర్రి నాగకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు అలహరి యోగానందాచార్యులు కల్యాణం జరిపించారు. పాలేటి తీరాన ఉన్న వరదాంజనేయ స్వామి ఆలయంలో కల్యాణోత్సవం, భారీ అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. అద్దాల బజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం, కొలిమిబజారులో శ్రీసీతారామ మందిరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు నిర్వహించారు. వెండి దేవాలయంలో కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మిట్టగూడెం, పాలేటి ఒడ్డున వేంచేసియున్న శ్రీవరద ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన శ్రీరాముని కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజ గోపాల్(తాతయ్య) పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వరద ఆంజనేయస్వామి వారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

ఆలయాల్లో మార్మోగిన రామనామం



నందిగామ సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో తాళిని చూపుతున్న అర్చక స్వామి

నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో ఆదివారం కల్యాణాన్ని వేదోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు దివి వంశీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణోత్సవాన్ని జరిపించారు. పలువురు దంపతులు కల్యాణ పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణ క్రతువులు నిర్వహించారు. మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొని విశేష పూజలు చేశారు. అదే విధంగా పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం, గాంధీ సెంటరులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మంటపంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, రాచూరి సీతారాం పాల్గొన్నారు.

రూరల్ మండలంలో..

నందిగామ రూరల్: జొన్నలగడ్డ, తొర్రగుడిపాడు, చెరువుకొమ్ముపాలెం, పల్లగిరి, మునగచర్ల, అడవిరావులపాడు, గోళ్లమూడి గ్రామాలలోని రామాలయాలు, ఆంజనేయ స్వామి వారి ఆలయాలలో సీతారామచంద్ర స్వామి వారి దివ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కె. కంద్రిక దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజల అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. పానకం, వడపప్పు ప్రసాదంగా పంపిణీ చేశారు.



సీతారామాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జగన్‌మోహనరావు



బ్రాహ్మణ బజారులోని ఆంజనేయ స్వామి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



బ్రహ్మం గారి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న భక్తులు



కొత్తపేటలో స్వామి వారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కంచికచర్లలో అన్న సమారాధన చేస్తున్న కమిటీ సభ్యులు



మక్కపేటలో రాములోరి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బతుకు బాట.. మెతుకు వేట

వ్యవసాయ పనిముట్ల తయారీ పనుల్లో మహారాష్ట్ర వాసులు

వత్సవాయి: పొట్టకూటి కోసం సొంతూరు వదిలి వస్తారు.. రోడ్డు పక్కనే చిన్న గుడారాలు వేసుకొని కుటుంబాలతో కలిసి జీవిస్తారు. అక్కడే చిన్నా చితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు. అలాంటి వారిలో కొందరు జగ్గయ్యపేట పరిసరాల్లో వ్యవసాయ పనిముట్లు తయారు చేసుకుంటూ బతుకు బండి లాగుతున్నారు. ప్రస్తుతం కొత్త సీజన్ కోసం రైతులు మళ్లీ పొలం బాట పట్టే సమయం ఆసన్నం కావడంతో వీరికి గిరాకీ పెరుగుతోంది.

వ్యవసాయ సీజన్‌కు ఏర్పాట్లు..

రబీ వ్యవసాయ సీజన్ ముగిసింది మే నెల గడిస్తే మరలా సీజన్ ప్రారంభమవుతుంది. మళ్లీ రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. పనులు ప్రారంభించడానికి ముందు వ్యవసాయానికి పనికి వచ్చే పనిముట్లపై రైతులు ఎక్కువగా దృష్టిపెడతారు. వారికి కావలసిన వాటిని వడ్రంగి వద్దకు వెళ్లి తయారుచేయించుకుంటారు. అయితే పరిస్థితులు మారడంతో గ్రామాల్లో రైతుల పనిముట్లు తయారు చేసే వడ్రంగులు కనుమరుగయ్యారు. వ్యవసాయం మొత్తం యాంత్రీకరణతో సాగడం వల్ల వారికి పని లేకుండా పోయింది. దీంతో రైతులకు వ్యవసాయంలో ఉపయోగపడే గొడ్డలి, పార, గడ్డపార, కొడవలి, లిక్కి వంటి వాటి తయారీ కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సివస్తోంది.

పనిముట్ల తయారీలో మహారాష్ట్ర వాసులు..

వ్యవసాయ పనిముట్ల తయారీలో మహారాష్ట్ర వాసులు జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తున్నారు. వారు గ్రామాల్లో ఒకచోట ప్రత్యేకంగా గుడారాలు వేసుకుని పనిముట్ల తయారీకి కొలిమిలు పెడుతున్నారు. రైతులకు కావలసిన పద్ధతుల్లో వారికి పనిముట్ల తయారు చేసి ఇస్తున్నారు. పనిముట్ల తయారీకి ఉపయోగపడే ఇనుమును వారే వెంట ఉంచుకుని రకరకాల వస్తువులను తయారు చేస్తున్నారు. మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన వీరు రైతుల వ్యవసాయపనిముట్ల తయారీ ప్రసిద్ధి. వీరు పదిరోజులపాటు ఒక గ్రామంలో ఉండి తరువాత వేరే గ్రామానికి వెళుతుంటారు. మార్చి నెల నుంచి జూన్ వరకు ఉండి వీరు మరలా వారి స్వస్థలాలకు వెళ్తారు.

వస్తువును బట్టి ధర..

రైతులకు అవసరమయ్యే వస్తువును బట్టి వీరు ధర నిర్ణయిస్తారు. రైతులకు కావలసిన వస్తువుకు వారే ఇనుమును తెచ్చుకుంటే కూలీ తీసుకుని తయారీ చేసి ఇస్తారు. లేకుంటే వారివద్ద ఉన్న ఇనుముతో తయారు చేస్తారు. కొడవలి తయారీకి రూ. 200, పార రూ.200, గడ్డపార రూ.400, కంపచెట్లు నరికే కత్తి రూ.350 చొప్పున కూలీ తీసుకుని తయారు చేస్తున్నారు. వీరు రైతులకు కావలసిన మాదిరిగా వెంటనే తయారు చేసి ఇవ్వడంతో రైతులకు కూడా బాగా ఉపయోగపడుతుంది. దీంతో వ్యవసాయ పనిముట్ల తయారీకి రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.



వత్సవాయిలో పనిముట్ల తయారీలో నిమగ్నమైన మహారాష్ట్ర వాసి

> **గతేడాది సీజన్ బాగుంది**
>
> ప్రస్తుతం కంటే గతేడాది సీజన్ బాగుంది. పోయిన ఖరీఫ్ సీజన్‌లో పంటలు బాగా పండి రైతులకు ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో ఎక్కువగా వ్యవసాయ పనిముట్లు తయారీ చేయించారు. మండలంలో ఇప్పటివరకు పది గ్రామాల్లో వస్తువులను తయారు చేశాం. ప్రస్తుతం అంతంత మాత్రంగానే పనులు వస్తున్నాయి. పనిముట్ల తయారీ సీజన్ పూర్తికాగానే సొంత గ్రామాలకు వెళతాం.
>
> – అనిల్, తయారీదారుడు

హోరాహోరీగా సెమీ ఫైనల్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీకాంత్



తలపడుతున్న ఎన్టీఆర్, ప్రకాశం జిల్లా జట్లు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని కొటికలపూడి గ్రామంలో అంబేడ్కర్ యూత్, కృష్ణా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు సెమీ ఫైనల్‌కు చేరాయి. ఆదివారం ఎన్టీఆర్, ప్రకాశం జిల్లా జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ పోటీలను అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (అడ్మినిస్ట్రేషన్) జి.శ్రీకాంత్ ఆదివారం రాత్రి ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన మూడు సెట్ల మ్యాచ్‌లో ప్రకాశం జట్టు రెండు సెట్లలో గెలిచి విజయం సాధించింది. ఒక సెట్టు గెలిచిన ఎన్టీఆర్ జట్టు ఓటమి పాలైంది. వాలీబాల్ పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు, స్థానికులు హాజరయ్యారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లు బండి వెంకటరావు, నంబూరి నాని, గ్రామ పెద్దలు రెంటపల్లి వెంకటేశ్వరరావు, మల్లి యూత్ సభ్యులు పర్యవేక్షించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమార్తె తిరిగి రాలేదని తల్లి ఫిర్యాదు చేయడంతో నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాష్‌నగర్‌కు చెందిన తానేటి చంద్రమ్మ ఇళ్లల్లో పనులు చేస్తుంది. ఆమె భర్త 18 సంవత్సరాల క్రితం మృతిచెందాడు. ఆమెకు 17 సంవత్సరాల కుమార్తె ఉంది. ఈ నెల మూడో తేదీన కూరగాయాలు తీసుకురావడానికి అని బయటకు వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద విచారించిన యువతి ఆచూకీ తెలియలేదు. ఫోను చేస్తే రింగ్ అవుతుంది కానీ లిఫ్ట్ చేయడం లేదు. యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమాజానికి జ్ఞానదీపం గురువు

విజయవాడకల్చరల్: అటు సమాజంలోనూ ఇటు వ్యక్తుల్లోనూ జ్ఞానదీపం వెలిగించేవాడు గురువు అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సాయిరాం మహారాజ్ అన్నారు. శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, నాట్యానికి సేవలను అందించిన నాట్య గురువులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. సాయిరాం మహారాజు మాట్లాడుతూ గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని సూచించారు. వందే జగద్గురుం మన విశ్వాసమని వివరించారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ నాట్య గురువులు సంప్రదాయ నృత్యాన్ని పరిరక్షించడానికి కృషి చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. విద్యావేత్త బాదినేని రాము మాట్లాడుతూ బాలబాలికల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. నాట్యాచార్యులు రోహితం లక్ష్మీవాత్సల్య, నట్టు వేణుగోపాల్, జొన్నాదుల బేబీ వెన్నెల, అవ్వారు శ్రీదేవి, చెన్నా తన్మయి, దామర్ల నాగచందన, పట్టెం మేఘన, దాము చరిష్మాదేవికి యువనాట్య గురు పురస్కారాలు ప్రదానం చేశారు. చిన్నారులు 150 మంది ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



నాట్యకళాకారులకు యువ నాట్యగురు పురస్కారాలను అందజేస్తున్న నిర్వాహకులు

28 నుంచి వేసవి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న గంగాధర్

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ఈ నెల 28 నుంచి తిరువూరులో నిర్వహిస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన జేవీవీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. జేవీవీ జిల్లా కార్యదర్శి రాంప్రదీప్, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, గౌరవాధ్యక్షుడు శీనయ్య, సభ్యులు పాపారావు, బి. వెంకటేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.